

ప్రమాదాల నివారణే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌లు

6 లో

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 02 ఏప్రిల్, 2024 | పేజీలు : 8

# సమస్యలే మా మున్సిపాలిటీ స్పెషాలిటీ

### నాలుగేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి
### కొత్త చైర్మన్ హయాంలో ముందుకు సాగేనా?



**ప్రజాపక్షం/మోత్కూర్ :** మోత్కూరు మున్సిపాలిటీలో సమస్యలు పేరుకుపోయాయి. గత పాలకులు సమస్యలను నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు నిత్యం సమస్యలతో సావాసం చేస్తున్నారు. రోడ్లు మురికి కాలువలు, టాయిలెట్స్, వాటర్, సిసి రోడ్లు లేక గత నాలుగు సంవత్సరాలుగా మున్సిపాలిటీ ప్రజలు సతమతమవుతున్నారు. చైర్మన్ వార్డ్ కౌన్సిలర్ల మధ్య అంతర్గత కుమ్ములాటలతో మున్సిపాలిటీ అభివృద్ధిని అటకెక్కించారని ఆరోపణలున్నాయి. నూతన ఛైర్మేన్ ఎన్నికతోనైన తమ సమస్యలు తీరతాయని పట్టణ ప్రజలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. మోత్కూరు మున్సిపాలిటీలో సుమారు 20 వేల జనాభా, ప్రక్కనేవున్న కొండగడప బుజిలాపురం రెండు గ్రామాలను కలుపుకొని, 2018లో మేజర్ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఏర్పడింది. ఈ మున్సిపాలిటీలో 12 వార్డులు వున్నాయి. కొత్తగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీ 2020లో టిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. డిసెంబర్లో రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటివరకు ఉన్న బిఅర్ఎస్ చైర్మన్ పై సొంత పార్టీ కౌన్సిలర్స్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో కలిసి, అవిశ్వాసం ఏర్పాటు చేసి, టిఆర్ఎస్ పార్టీ చైర్మన్‌ను పదవి నుండి తప్పించారు. చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ చైర్మన్ ఎన్నిక కావడంతో మున్సిపాలిటీ అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని మున్సిపాలిటీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రధాన రహదారి రూ.4 కోట్లతో 80 ఫీట్లకు విస్తరించి పనులు చేపట్టారు. పనులు పూర్తి కాకపోవడంతో పట్టణవాసులకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య వెంటనే పరిష్కరించాల్సిన అవసరం వుంది. పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వరకు, పోతాయిగడ్డ అంబేద్కర్ చౌరస్తా నుండి బిఎస్ఎన్ఎల్ ఎక్సేంజ్ వరకు రూ.2 కోట్లతో డివైడర్ నిర్మించి, మధ్యలో సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటారు. కానీ, వాటిని సంరక్షించేవారు లేక, అవి పూర్తిగా ఎండిపోయాయి. లక్షల రూపాయలు వృధా అయ్యాయి. హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని ఎండి, విరిగి, పశువులకు మేకలకు ఆహారంగా మారాయి. స్మశాన వాటిక ఆధురీకరణ కోసం, కోటి రూపాయలతో పనులు చేపట్టారు. ప్రారంభానికి నోచుకోక ముందే మరుగున పడింది. పనులు నాసిరకంగా చేపట్టడంతో నిర్మించిన నిర్మాణాలు పగుళ్లు పట్టాయి. ఏర్పాటుచేసిన షెడ్లు గాలి వానకి ఎగిరి పోయాయి. రూ.2 కోట్లతో నిర్మిస్తున్న ఇంట్రిగ్రేడ్ మార్కెట్ మధ్యలోనే నిలిచిపోయింది. పెద్ద చెరువులోకి మున్సిపాలిటీ మురుగు నీరు చేరుతుంది. మురుగు నీరుతో పాటు చెత్తా చెదారం, వ్యర్థాలు, చేరి దుర్గంధం వెదజల్లడమే కాక, దోమల చేరి, పట్టణవాసులకు పలు ఆరోగ్యసమస్యలు తలెత్తుతున్నాయి. మురుగు నీరు చెరువులోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలి. సుందరయ్య కాలనీ మున్సిపాలిటీలో భాగమైన, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మురుగు కాలువలు నిర్మాణం జరగలేదు. సిసి రోడ్లు మచ్చుకైనా కనిపించవు. సుందరయ్య కాలనీలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు వేయించాల్సిన అవసరం ఉంది. ఇంట్రిగేటెడ్ మార్కెట్, స్మశాన వాటిక, ప్రధాన రహదారి పనులు పూర్తి చేసి, అవసరాలకు అనుగుణంగా టాయిలెట్స్, సీసీ రోడ్లు నిర్మించి, డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎన్నికల విధులు, బాధ్యతలు పారదర్శకంగా ఉండాలి

### మొదటి రోజు శిక్షణకు 1188 మంది హాజరు
### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ఎన్నికల విధులు బాధ్యతలు పారదర్శకంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సూచించారు. సోమవారం సూర్యాపేట సెగ్మెంట్ సంబంధించిన పివో, ఎపీవోలకు స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిబ్బంది విధులు, బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించాలని, ఈవిఎం యంత్రాల పనితీరుపై సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో పివో, ఎపివోలకు ఎన్నికల రోజున నిర్వహించే విధి విధానాలపై అవగాహన కల్పించారు. లోక్ సభ ఎన్నికల పోలింగ్ పకడ్బందిగా పారదర్శకంగా జరిగేందుకు కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, పివో, ఎపీవోలు ఈవీఎంలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవిఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల కనెక్షన్లు, వాటి పనితీరు, మరమ్మతు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాలుగు సెగ్మెంట్లలో 1416 మంది పివో, ఎపీవోలకు గానూ మొదటి రోజు 1188 మంది హాజరయ్యారని, మొదటి రోజు హాజరుకాని వారు రెండోరోజు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ శిక్షణలో పాల్గొనకపోతే వారిపై చర్యలుంటాయన్నారు. జిల్లాలో పోలింగ్‌కు ముందస్తుగా ప్రతి ఓటర్‌కు ఓటర్ స్లీపులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీవో వేణుమాదవ్, తహసిల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, డిఓవో శ్రీధర్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# ప్రతి పోలీస్టేషన్‌కు సైబర్ వారియర్స్



### జిల్లా ఎస్‌పి రాహుల్‌హెగ్డే

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలోని అన్నీ పోలీస్టేషన్‌లనందు పోలీస్ సైబర్ వారియర్స్ పనిచేస్తున్నారు. సోమవారం సైబర్ వారియర్స్‌కు హెల్ప్‌లైన్ నెంబర్లు, మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే తన కార్యాలయంనందు అందచేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతికతో పాటుగా సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి సైబర్ నేరాలకు పాల్పడి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారని వీరి నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వార ఆన్‌లైన్ ద్వారా 1930 జాతీయ టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకున్నాక వాటి స్థితిగతులు తెలుసుకునేందుకు తిరిగి టోల్ ఫ్రీ 1930కి ప్రయత్నం చేస్తున్నారు దీని వలన ఫిర్యాదులు చేసుకునే వాటికి ఆటంకం కలుగుతున్నదని గుర్తించి ఫిర్యాదుదారులు వారి యొక్క సైబర్ నేరాల ఫిర్యాదులు, కేసుల యొక్క స్థితిగతులు తెలుసుకోవడానికి వీలుగా అన్ని పోలీస్టేషన్‌ల పోలీస్ సైబర్ వారియర్స్‌కు నూతన హెల్ప్‌లైన్ నంబర్స్, మొబైల్ ఫోన్స్, రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ వారు అందించిన వీటిని ఎస్పీ సిబ్బందికి అందించారు. ఫిర్యాదు నమోదు చేసుకున్నాక ఫిర్యాదుదారుడు తన యొక్క కేసులు వివరాలు తెలుసుకోవడానికి వెంటన సంబంధిత ఫిర్యాదుదారుని చరవాణికి పంపడం జరుగుతుందని, దీని ద్వారా సైబర్ ఫిర్యాదురాలు,కేసులు స్థితిగతులు ఫిర్యాదుదారలు నేరుగా పోలీస్టేషన్‌లో సైబర్ సెక్యూరిటి సిబ్బందికి ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి పోలీస్టేషన్ నందు సైబర్ వారియర్స్ సిబ్బంది ఉన్నారని, సైబర్ ఫిర్యాదులు, కేసులపై ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వడానికి ఈ సిబ్బంది కృషి చేస్తారని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి రాజేష్‌మీనా, సైబర్ సెక్యూరిటి డియస్పీ శ్రీనివాసరావు, సైబర్ సెక్యూరిటి ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ, సైబర్ సెక్యూరిటి సిబ్బంది పాల్గొన్నారు.

## బూరా... నోరు అదుపులో పెట్టుకో

### మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



వివరాలు మెయిన్‌లో

# బెట్టింగ్ నిర్వాహకులకు కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** ఐపీఎల్ క్రికెట్ నిర్వహణ సందర్భంగా బెట్టింగ్ నిర్వాహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని, పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. బెట్టింగ్ అనే విష సంసకృతి వల్ల అనేక జీవితాలు ఆర్థికంగా నష్టపోయి అనేక కుటుంబాలు రోడ్డున పడి నాశనం అవుతున్నాయని అన్నారు. ఈ బెట్టింగ్ విష సంస్కృతి పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించిందని, రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశతో భార్యల మీద బంగార తాకట్టుపెట్టి మరీ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని అన్నారు. చివరికి చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. బెట్టింగ్‌లకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని లింగంగౌడ్ పేర్కొన్నారు.

# వైభవంగా విగ్రహాల ఊరేగింపు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ప్రతిష్టించే విగ్రహాలను సోమవారం అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు.ఈ నెల 19,20,21 తేదీలలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరుపతిలో కృష్ణశిలలతో అత్యంత ఆకర్షణీయంగా మలిచిన కోదండరాముడు, సీతామాత, లక్ష్మ ణ,ఆంజనేయ, జయవిజయ విగ్రహాలను శ్రీవాణి పాఠశాల ఆవరణ నుండి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై విగ్రహామూర్తులను మేళాతాళాలతో ఊరేగింపుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదేశంలో ఉంచారు. విగ్రహాల ఊరేగింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు,వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు పదవి ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తాడూరి పరమేష్, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, సంయుక్త కార్యదర్శి జెల్లా రమేష్, కోశాధికారి పడమటి మహిపాల్ రెడ్డి, స్పోర్టట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి మక్తల నరసింహ, గ్రంథాలయ కార్యదర్శి నర్రి స్వామి, మహిళా కార్యదర్శి స్వాతి, సభ్యులు జక్కర్తి శేఖర్, జంపాల శ్రీశైలం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ కోర్టు న్యాయమూర్తి వైష్ణవి మాట్లాడుతూ న్యాయ వాద వృత్తి గౌరవ ప్రదమైన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, బాల్యం వెంకటచలం, వాకిటి నరసింహారెడ్డి, కానుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి : ఎంఎల్ఎ




ప్రజాపక్షం/చౌటుప్పల్ : క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లి గ్రామంలో ముసుకు మధుసూదన్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన చౌటుప్పల్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలో సోమవారం ముగిసాయి. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో ఏదో ఒక క్రీడను ఆడటం అలవాటు చేసుకోవాలని అన్నారు. నిత్యం క్రీడలు మానసిక ఉత్సాహంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, సింగిల్ విండో చైర్మన్ చెన్నగోని అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనా రెడ్డి, మండల అధ్యక్షులు బోయ అంబేద్కర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చామకూరి యాదయ్య, బండమీది వెంకటేశం, బత్తుల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అంతరించిపోతున్న కళలకు జీవం పోస్తున్న కళాకారులు




**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** అంతరించిపోతున్న కళలకు కళాకారులు జీవం పోసే విధంగా నాటక ప్రదర్శనలు ఉండడం అభినందనీయమని ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. రాష్ట్ర భాష సాంస్కృతికశాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నందిని నాటకోత్సవాల పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటక పోటీలు సోమవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఆర్డీవో శ్రీనివాస్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నాటక ప్రదర్శనలు సమాజాన్ని మేలుకొలిపే విధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువతలో చైతన్యం నింపే విధంగా నాటక ప్రదర్శనలు జరపాలన్నారు. రక్తపాశం, జీవనయాగం, మైరావణ, నాలోన నీవే సాంఘీక, పద్య నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు బోయినపల్లి భుజంగరావు, కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ, కోశాధికారి పులభట్ల లక్ష్మీ నారాయణశర్మ, సభ్యులు రామావతారం, సాయిలు, మామిడాల ఉపేందర్, రాఘవయ్య, శ్రీనివాస్‌రావు, యడవెల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి భావాలను పెంపొందించుకోండి : ఎంఎల్ఎ



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** భక్తి భావాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. సోమవారం యాద్గార్‌పల్లిలో జరిగిన గంగమ్మ జాతరలో ప్రత్యేక పూజలో పాల్గొని వారు మాట్లాడారు. యాదవుల ఆరాధ్య దైవమైన గంగమ్మ దేవత జాతర ప్రత్యేక భక్తిశ్రద్ధలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పండుగల ప్రాధాన్యతను భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాయం రజిత తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలలో అలసత్వం వద్దు



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అందరూ ప్రజారోగ్యం కొరకు తమ విధులను సక్రమంగా నిర్వహించి మంచి పేరును సంపాదించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా॥ వై.పాపారావు అన్నారు. సోమవారం ఆయన యాదాద్రి భువనగిరి డిఎం అండ్ హెచ్వోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలను జిల్లా ప్రజలకు సక్రమంగా అందేలా సిబ్బంది కృషి చేయాలన్నారు.జిల్లా లో ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉప కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం వహించిన శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.వైద్యాధికారులకు మరియు సిబ్బందికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఎంసిహెచ్ కార్యక్రమాలు 100 శాతం జరిగేలా కృషి చేయాలన్నారు.ఆరోగ్య సేవలలో జిల్లాను మొదటి మూడు స్థానాల్లో ఉండేలా చూడాలన్నారు. ప్రతి కార్యక్రమం ఆన్ లైన్ లోనే నమోదు చేసేలా చూడాలని సూచించారు.ప్రస్తుతం ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవలన్నారు. వడదెబ్బ నిర్వహణపై ఆరోగ్య సిబ్బందికి తగిన శిక్షణ అందించాలని ఆదేశించారు.

# బోధవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/నడిగూడెంః బోధ వ్యాధి ( ఫైలేరియా) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ గుర్రం విజయ్‌కుమార్ అన్నారు.సోమవారం త్రిపురవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశాలు నాలుగు టీంలుగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మురుగునీరు లేకుండా చూసుకోవాలని, సెప్టిక్ ట్యాంకు పైపుకు జాలిని అమర్చుకోవాలన్నారు.బోధ వ్యాధి ఉన్న వారిని దోమలు కుట్టినట్లయితే అదే దోమ ఆరోగ్యవంతుడిని కుట్టినట్లయితే వారికి కూడా బోధవ్యాధి వ్యాపిస్తుందన్నారు. రాత్రి పూట నిద్రించే సమయంలో ప్రతి ఒక్కరు దుప్పటి కప్పుకుని నిద్రించాలన్నారు.



# ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/వేములపల్లిః** మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన శ్రీ గంగమ్మ జాతరలో మిర్యాలగూడ శాసనసభ సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్, ఉపాధ్యక్షులు రావు ఎల్లారెడ్డి, ఎంపీపీ పుట్టల సునీత వైస్ ఎంపిపి గోవర్ధన, కాంగ్రెస్ నాయకులు పేరెల్లి నగేష్. తదితరులు పాల్గొన్నారు.

# చామల కిరణ్‌రెడ్డిని గెలిపించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** భువనగిరి పార్లమెంటు సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని యువజన కాంగ్రెస్ ఆర్టిఐ డిపార్ట్మెంట్ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షులు తోర్పునురి శ్రీకాంత్ కోరారు. గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కిరణ్ కుమార్ రెడ్డి కృషి చేశారని అన్నారు. నిత్యం కార్యకర్తలకు అండగా ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉండి కష్టపడి పని చేసే అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి అని అన్నారు. ప్రజలు కిరణ్ కుమార్ రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపిడిఒ

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డులో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో నిరంజన్ వలి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. రైతులు నాణ్యతమైన ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం పకీరయ్య, మార్కెటింగ్ సూపర్వైజర్ శివ కుమార్, ఏఈఓ మనిషా, సీసీలు వెంకటేశ్వర్లు, భాస్కర్, ఎమ్మెస్ అధ్యక్షురాలు లక్ష్మి, వివో అధ్యక్షులు పావని, అనిత, వివోఏలు శిరీష, శ్యామల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ పీటర్స్ విద్యార్థికి నవోదయ సీటు



**ప్రజాపక్షం /మోటకొండూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి గండికోట యశ్వంత్ 202425 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయం చలకుర్తిలో సీటు పొందారు. ఈ సందర్భంగా మోటకొండూరు సెయింట్ పీటర్స్ పాఠశాల యాజమాన్యం విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ మీసాల రాజయ్య కరెస్పాండెంట్ కానుకుంట్ల రవీందర్ మాట్లాడుతూ మోటకొండూరు మండలంలో గత 19 సంవత్సరాల క్రితం స్థాపించి ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన ఘనత సెయింట్ పీటర్స్ పాఠశాల అని అన్నారు.

## ధాన్యాన్ని ఎ గ్రేడ్‌గా కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండల వ్యాప్తంగా పండించిన వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వెంకట్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, పట్టణ కార్యదర్శి కోడె బాల నరసింహ మాట్లాడుతూ పోచంపల్లి మండల ప్రాంతాన్ని మూసి ప్రాంతం పేరుతో ధాన్యం బి గ్రేడ్‌గా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలో క్వింటాకు రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పిన మాటను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, పరమేష్‌లు తదితరులు వారి వెంట ఉన్నారు.

## సరైన పత్రాలు లేకుంటే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** సరైన పత్రాలు లేని వాహనాలను నడిపినట్లయితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ జిల్లా రవాణా అధికారి సాయి తెలిపారు. నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండలంలో ఎటువంటి పత్రాలు లేకుండా నడుపుతున్న ఇసుక ట్రాక్టర్ ని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు అప్పగించారని స్థానిక ఎస్సై వాసా ప్రవీణ్ కుమార్ విలేకరులకు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి, ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనం, ట్రాక్టర్, ట్రాలీ ఆటోలు, డీసీఎంలు సరైన పత్రాల తో పాటు వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపినట్లయితే సీజ్ చేసి చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో సోమవారం తహశీల్దార్ జలజ కుమారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులు ధాన్యాన్ని తేమ శాతాన్ని చూసుకొని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులు దళారులను నమ్మకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకొని లాభాలు పొందాలని అన్నారు. సిఈవో నాగయ్య, బ్యాంక్ సిబ్బంది సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గులాబీ జోష్ నెలకొన్నది : కెటిఆర్



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలకు ప్రజలు బోల్తా పడ్డారు.. కాంగ్రెస్ పాలనపై ప్రజలలో వ్యతిరేకత వచ్చి గులాబికి జోష్ నెలకొన్నది. ఇదే జోష్ రెట్టింపు ఉత్సాహంతో పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు దిశగా పోరాడాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చారు. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలోని లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించారు. సమావేశానికి కెటిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ హయాంలోనే ఉద్యోగాల నోటిఫికేషన్ వేసి పరీక్షలు నిర్వహిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డర్ పత్రాలు ఇచ్చి గొప్పలకు పోతున్నారన్నారు. రైతులను రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని దీనిద్వారా బ్యాంకులు అన్నదాతలను తీసుకున్న రుణాలను చెల్లించాలని పీడిస్తున్నాయని ఆరోపించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాతల పంటలు ఎండిపోతుంటే కనీసం రైతులను ఓదార్చే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. అక్రమ కేసులు పెట్టడమే కాంగ్రెస్‌కు అలవాటైందని, కేసులతో మనల్ని భయపెట్టించాలని చూస్తున్నారని, వారి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ దొంగలు ఫోన్ ట్యాపింగ్ పేరుతో భయబ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని ఒకటి కూడా నిజం లేదని బదనామ్ చేయడమే వారి నైజం అని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు, రైతులు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్‌పి చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, రమావత్ రవీంద్ర కుమార్, భాస్కర్‌రావు, గాదరి కిషోర్, నోముల భగత్, అనిల్ కుమార్, చెరుకు సుధాకర్, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, పల్లె రవి కుమార్, పల్లా ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, తదితరులున్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల



**ప్రజాపక్షం /భువనగిరిరూరల్ :** విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ తెలిపారు. భువనగిరి ఎస్‌వి హోటల్లో నిర్వహించిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్ బకాయిలు రూ.7200 కోట్లు విడుదల చేయాలన్నారు. లేనియెడల కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని హెచ్చరించారు. 100 రోజుల్లోనే ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదన్నార. 100రోజుల్లో రాజీవ్ గాంధీ ఇందిరాగాంధీ విగ్రహాలు వచ్చినాయి గాని విద్యార్థుల సమస్యలు తీరలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బిజెపి 6, బిఆర్ఎస్ 4, కాంగ్రెస్ పార్టీ బీసీలకు 2 టికెట్లు కేటాయించడం సిగ్గుచేటు అన్నారు. అన్ని పార్టీలు బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలన్నారు. బీసీ కార్పొరేషన్లను 56కు పెంచాలన్నారు. తక్షణమే ఫీజు రీయిమెంట్స్ స్కాలర్షిప్ విద్యార్థుల సమస్యలు అన్ని రంగాల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అన్నారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, ఉపసర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షులు రాసాల యాదయ్య గౌడ్, నల్లమాసం నాదం, ఎస్ఎఫ్ఐ వలిగొండ మండల అధ్యక్షులు పరధిన్, మనోజ్, మురళి, యూసన్, హాయ్ కిరణ్, మల్లేష్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి




**ప్రజాపక్షం/ తుంగతుర్తి:** దేశం ప్రశాంతంగా ఉండాలన్ని, కార్పోరేట్ దోపిడిని అడ్డుకోవాలన్న, ప్రజలకు కనీస ప్రజాస్వామ్యం దక్కాలంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని కామ్రెడ్ దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతా అల్లర్లతో అల్లకల్లోలంగా మారుతుందని, భవిష్యత్ తరాల మెదల్లో విష బీజాలు నాటే పనిలో కేంద్రంలో ఉన్న బిజేపి మోడి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాతంత్ర, వామపక్ష, విప్లవ పార్టీలన్ని ఫాసిస్ట్ బిజేపిని ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి పేర్ల నాగయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు వేర్పుల లక్ష్మయ్య, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల దుర్గయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ వేర్పుల కరుణాకర్, పేర్ల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** రైతులు నాణ్యమైన ధాన్యాన్ని ఐకెపి సెంటర్‌కు తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ లత అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, రైతులు ధాన్యంను అరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి 2203రూపాయలు, కామన్ గ్రేడ్ 2183 రూపాయలు మద్దతు ధర రైతులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్‌వో మోహన్‌బాబు, అగ్రికల్చర్ ఎవో బాలకష్ణ, తహసిల్దార్ రమణారెడ్డి, ఎంపీవో భీమ్‌సింగ్, ఎపిఎం నర్సయ్య, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/మునగాల:** పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపిపి కొలిశెట్టి బుచ్చిపాపయ్య అన్నారు. మండల పరిధిలోని తాడ్వయి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి, గోపాల మిత్ర సిబ్బంది సైదులు, నరేష్ పాడి రైతులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నిక



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేటకు చెందిన కళ్లేపల్లి నరేష్ నియమించబడ్డారు. ఈ మేరకు సోమవారం హైద్రాబాద్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం చైతన్యపురిలో రాష్ట్ర ఐఎన్‌టియుసి అధ్యక్షులు మురారి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, ఇండియన్ నేషనల్ ట్రేడ్స్ యూనియన్ కాంగ్రెస్ కార్మికుల పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. తనపై నమ్మకంతో తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి మాజీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాజు, మీసాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్, ఎంపిడిఒ



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని ఏఎంసీలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ లాల్ బహూదర్, ఎంపీడీవో యాకుబ్‌నాయక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈఎం రాంప్రసాద్, అగ్రికల్చర్ ఏవో సరస్వతి పద్మజ, ఎంకెటీ ఆనంద్, మార్కెట్‌యార్డు సెక్రటరీ మహమ్మద్‌వహీద్, సూపర్‌వైజర్ రమేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, రాణి, మహేశ్వరి, ఐకేపీ సీసీలు బాబు, నర్సిరెడ్డి, మహేష్, మహిళ సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## జాగటి యాదయ్య మృతి బాధాకరం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని బిసి కాలనీకి చెందిన జాగటి యాదయ్య(41) ఆదివారం సాయంత్రం సైకిల్ పంపు కొడుతూ గుండెపోటుతో మరణించాడు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు యాదయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు. జాగటి యాదయ్య మృతి బాధాకరం అని వేమన్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన యాదయ్య మృతి బంధువులకు, మిత్రులకు, కొండమల్లేపల్లి ప్రజలకు తీరని లోటు అని అన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం /తిరుమలగిరి సాగర్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో జానకిరామ్ అన్నారు. సోమవారం మండలంలోని తిరుమలగిరి, అల్వాల లో ఐకెపి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు. తేమ శాతం 17 శాతం లోపు ఉండే విధంగా రైతులు నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నరసింహ, మండల సమైక్య అధ్యక్షురాలు మొగలమ్మ, మునగాల ప్రమీల, సీసీలు తంగమణి, విజయ్, వివోఏలు కలమ్మ, మరియమ్మ, రైతులు నందయ్య , చంద్రయ్య ,దండం శ్రీను, గోపి, శ్రీను మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లో జాతీయస్థాయి పరీక్షల్లో శ్రీహన్‌కు 7వ ర్యాంకు



**ప్రజాపక్షం/కోదాడః** పట్టణానికి చెందిన నెమ్మాది శ్రీహాన్ ఒలంపియాడ్ పరీక్షలలో ప్రతిభకనబర్చి జాతీయ స్థాయిలో ఏడవ స్థానం పొంది కోదాడకు వన్నె తెచ్చారు. సోమవారం రవీంద్రభారతిలో కౌన్సిలర్ ఫర్ నర్సరింగ్ అకాడామిక్ పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో మెమోంట్లో సర్టిఫికేట్లను శ్రీహన్‌కు అందచేశారు. శ్రీహన్ నారాయణ విద్యాసంస్థల్లో 4వ తరగతి చదువుతున్నాడు.శ్రీహాన్ తల్లిదండ్రులు కళ్యాణచక్రవర్తి.డా.లక్ష్మి ప్రసన్న ఉన్నారు.తండ్రి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి జిల్లా అసంక్రమితవ్యాధుల నివారణ అధికారి కాగా తల్లి డాక్టర్ లక్ష్మి ప్రసన్న త్రిపువరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. శ్రీహన్ తాత జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా పదవివిరమణ చేయగా బాబాయి, అత్తయ్యలు ఇద్దరు ప్రభుత్వ వైద్యులు గమనార్హం. వారసత్వం ప్రతిభా పాఠవాలు పునికి పుచ్చుకున్న శ్రీహన్‌కు ఉపాధ్యాయులు,బంధువులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# మతతత్వ బిజెపిని ఓడించాలి




**ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్):** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బిజెపిని ఓడించి వామపక్ష లౌకిక శక్తుల్ని గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సంఘం జిల్లా కమిటి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలను చైతన్యం చేయడం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 జూన్ 1వ రకు సభలు, సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. ఒకే దేశం, ఒకే నాయకుడు , ఒకే పార్టీ అనే నినాదంలో హిట్లర్ విధానాలను మోదీ అమలు చేస్తున్నారని విమర్శించారు. నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం దేశంలో 5800 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే, వ్యవసాయ కార్మికులు 5970 మంది ఆత్మహత్య చేసుకున్నారని, నరేంద్ర మోదీ తిరిగి అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేస్తారని వెంకట్ అన్నారు. బొజ్జ చిన్నవెంకులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, కార్యదర్శి నారీ ఐలయ్య, రాష్ట్ర కమిటి సభ్యులు కత్తుల లింగస్వామి, రవినాయక్, సరోజన, జిల్లా నాయకులు చింతపల్లి లూర్థు మారయ్య, బొడ్డు సైదులు, కల్లూరి కుమారస్వామి, అలివేలు, దండు నాగరాజు, హనుమంతు, అంజనేయులు, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది బాధ్యతతో పని చేయాలి





**ప్రజాపక్షం /నిడమనూరుః** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల సిబ్బంది బాధ్యతతో పని చేయాలని విధుల పట్ల నిర్లక్ష్యం వస్తే క్షమించేది లేదని నాగార్జున సాగర్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె శ్రీనివాస్ అన్నారు. పి ఓ లు, ఏపీవోలకు రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులలో భాగంగా మొదటి రోజు సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సమయంలో ఓటర్లతో మసులుకోనే తీరు ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై సలహాలు సూచనలు అందజేశారు. ఎన్నికల్లో పాల్గొను సిబ్బందికి ప్రత్యేక స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇచ్చినందున ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నిడమనూరు తాసిల్దార్ జై కృష్ణయ్య, అనుముల తాసిల్దార్ జయశ్రీ, తిరుమలగిరి సాగర్ తాసిల్దార్ యాదగిరి, గుర్రంపోడ్ తాసిల్దార్ కిరణ్ నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మా డబ్బులు మాకు ఇవ్వండి మహా ప్రభో....




**ప్రజాపక్షం/నందికొండః** పైలాన్ కాలనీలోని పోస్ట్ ఆఫీస్ లో ఖాతాదారులు జమ చేసుకున్న డబ్బు తమకు ఇవ్వాల్సిందే అని పోస్ట్ ఆఫీస్ ని మూసి వేయించి మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పైలాన్ పోస్ట్ ఆఫీస్ లో సబ్ పోస్ట్ మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ చేతివాటాన్ని ప్రదర్శించి ఖాతాదారులు జమ చేసుకున్న సుమారు రెండు కోట్ల నగదును స్వాహా చేశాడు దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా పోస్టర్ ఉన్నతాధికారులు సర్వే నిర్వహిస్తున్నామంటూ నాలుగు నెలల పైగా కాలయాపన చేస్తూ వస్తున్నారని తాము పోస్ట్ ఆఫీస్ లో జమ చేసుకున్న డబ్బులను తమకు త్వరగా ఇవ్వాలని పలుమార్లు పోస్టల్ ఉన్నతాధికారులకు విన్నవించుకున్న నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఖాతాదారులను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పై పోలీస్ అధికారులు చొరవ చూపి పోస్టల్ ఖాతాలో నగదు మాయం చేసిన నిందితుడు రామకృష్ణ ను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై దేవరకొండ పోస్టల్ ఇన్స్పెక్టర్ మదన్ మోహన్ ను వివరణ కోరగా ఖాతాదారుల నగదు పోవడంపై విచారణ కొనసాగుతుందని ఖాతాదారుల రికార్డుల నమోదు పూర్తయిందని దీనికి చేతివాటం ప్రదర్శించిన రామకృష్ణ స్టేట్మెంట్ రికార్డ్ చేసి ఉన్నతాధికారులకు పంపించి త్వరలో ఖాతాదారుల నగదు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కొనుగోలు మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పకడ్బంధీగా అమలు చేసి రైతులకు, ప్రభుత్వానికి నష్టం జరగకుండా కొనుగోలుకు చర్యలు చేపట్టాలని జిల్లా సహకార అధికారి ఆర్ కిరణ్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వి వెంకటేశ్వర్లు అన్నారు. నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా నిర్వహించబడే వరి ధాన్యం కొనుగోలు చేసే సెంటర్ల టాబ్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొనుగోలు ధాన్యం తీసుకొస్తున్న రైతుల వివరాలతోపాటు విక్రయించిన సమాచారాన్ని ట్యాబ్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యం పంపించాలని, నిబంధనలను అతిక్రమించి పంపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ డి నాగేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత రైతుల ఖాతాలకు డబ్బులు పడే విధముగా వెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ట్యాబ్ ఆపరేటర్లకు సూచించారు. మానిటరింగ్ అధికారులు, పాక్స్ కార్యదర్శులు, పిపిసి ఇంచార్జీలు పాల్గొన్నారు.

## బిసి గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన నూతన కార్యదర్శి



**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్ బిసి గురుకుల పాఠశాలను మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయ సంస్థ నూతన కార్యదర్శి సైదులు సోమవారం పరిశీలించారు. ఆయన పాఠశాలలోని అన్ని తరగతులను విధిగా తిరిగి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠ్యంశాలలోని కొన్ని అంశాల గురించి అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలను రాబట్టారు. అనంతరం ఆయన విద్యార్థుల వసతి గృహం, భోజనశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే పేద విద్యార్థులకు ఉత్తమమైన విద్యను మంచి ఆరోగ్యాన్ని అందించడానికి బిసి గురుకుల విద్యాలయ సంస్థ కృషి చేస్తుందని విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను తీసుకొచ్చి పాఠశాలకు తగిన గుర్తింపును తీసుకురావాలని సూచించారు. డిగ్రీ కళాశాల విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడంతో విద్యార్థులను పాఠశాలకు వచ్చే విధంగా సంబంధించిన అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట నలగొండ ఆర్‌సిఓ సకినా, ప్రిన్సిపల్ రజనీకాంత్,డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ రవీంద్రచారి,పూర్వ ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి,మాధవరెడ్డి పూర్వ విద్యార్థి శివాజీ పాల్గొన్నారు.

## సంపూర్ణ అవగాహనతోనే సమర్ధవంతంగా ఎన్నికలు

**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** ఎన్నికల శిక్షణ సంపూర్ణ అవగాహనతోనే సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆర్‌వో, ఆర్డీవో జి.శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో వారికి తగిన సలహాలు, సూచనలను ఆయన అందచేశారు. శిక్షణను సంపూర్ణంగా అర్ధం చేసుకోని పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఎన్.హరిబాబు, శ్రీనివాస్‌శర్మ, పద్మ, ప్రమీల, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఎస్ఏ జానిషరీఫ్, నోడల్ ఆఫీసర్లు, ఎంఈవో బాలాజీనాయక్, మాస్టర్ ట్రైనర్ బాలు, జి.కోటయ్య, అంబటి శ్రీను, రాంచంద్రు, జనార్ధన్, గోవర్ధన్, సైదులు, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి ;** మండల పరిధిలోని పెండ్లీపాకల, చిన్నఅడిశర్లపల్లి గ్రామాలలో సోమవారం రైతు సేవా సహాకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ వెంకన్నతో కలిసి డిటిసిఎస్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యంను అమ్ముకోవాలని అన్నారు. దళారులకు విక్రయించవద్దని అన్నారు. ప్రభుత్వం ఏగ్రేడ్ వరి ధాన్యంకు రూ. 2203 మద్దతు ధరను, బిగ్రేడ్ వరి ధాన్యంకు రూ. 2183 మద్దతు ధరను ప్రకటించిందని అన్నారు. రైతులు ధాన్యం తేమ శాతం 17 ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, పిఏసిఎస్ సిఈవో పల్లా తిరుపతిరెడ్డి, సిబ్బంది పాపిరెడ్డి, నరేష్, లక్ష్మ ణ్, హరి, అంజి, రైతులు మధునాయక్, హర్యనాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పదవీ విరమణ సన్మానాలు

**ప్రజాపక్షం/కొండమల్లేపలి ;** గత 28 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు చెన్నగాని ఈదయ్యను ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీనివాసులు, తోటి ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. దోనియాల ఎంపిపిఎస్ పాఠశాలలో పదవి విరమణ పొందిన దొడ్డి సుధాకర్ ఉపాధ్యాయుడిని తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాతృనాయక్, ఉపాధ్యాయులు కొర్ర లోక్యనాయక్, వాసికర్ల రమేష్, నల్ల నరసింహా, శ్రీపతిరావు, సీతారాం, జగదీష్, సైదానాయక్, ఉమామహేశ్వరి, దయాకర్, శ్రీనయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేతనాలు రాక గ్రామపంచాయతీ కార్మికుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/అనంతగిరి :** గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు , సిబ్బందికి గత ఎనిమిది నెలల నుండి వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు. గతంలో సర్పంచ్‌ల పదవికాలం కొనసాగినప్పుడు ప్రతినెల కార్మికులకు అందించారని, మండల గ్రామపంచాయతీ కార్మికుల సంఘం సహాయ కార్యదర్శి బెక్కం చంద్రరావు అన్నారు. ఎండలు రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ప్రజలకు త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత, ఇంటింటికి చెత్త సేకరణ వంటి సేవలు జీతాలు రాకుండా గ్రామపంచాయతీ కార్మికులు, సిబ్బంది అందిస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన అధికారులను కోరారు.

## బిఆర్ఎస్ నుంచి సిపిఎంలో చేరిక

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలం శర్బనాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామ చెర్ల సిద్దులు పార్టీకి రాజీనామా చేసి సిపిఎం జిల్లా కార్యదర్శి భువనగిరి పార్లమెంటు సభ్యులు ఎండి.జాంగిర్ సమక్షంలో సిపిఎం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సుధగాని సత్య రాజయ్య, బుగ్గ నవీన్, టౌన్ అధ్యక్షుడు ఇక్బాల్, పార్టీ నాయకులు అంగడి నాగేష్, సుదగాని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బీరువాకై ఆర్థిక సహాయం అందచేత



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని ఎన్నారం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థి ఏనుగు ఆదిత్యరెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు ఏనుగు రామిరెడ్డి రేవతి దంపతులు పాఠశాలకు బీరువా బహూకరణకై రూ.15వేలను ప్రధానోపాధ్యాయుడు బి.రాజగోపాల్‌కు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పల్సం భిక్షం, కూసుకుంట్ల భిక్షరెడ్డి, మూసోజు మహేశ్వరచారి, కక్కిరేని సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పుట్టినరోజు సందర్భంగా దాతృత్వ సంస్కృతి అలవాటు కావాలన్నారు. ఎన్నారం గ్రామంలో ఇలాంటి సంస్కృతి ఇప్పటికే ప్రారంభమైందన్నారు.
ఫోటోరైటప్: పాఠశాలకు ఆర్థిక సహాయం అందచేస్తున్న దాతలు.

## ఎస్సీ మోర్చా నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మేడి సాగర్, మండల ప్రధాన కార్యదర్శులుగా, కొంగరి శంకర్, గజ్జెల్లి మధు, కార్యదర్శులుగా రాజు కొంగరి, ముప్పిడి సాయికిరణ్, బూడిద సైదులు, పతేపురం ముత్యాలు ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గజరాజ్ కాశీనాథ్, జిల్లా నాయకులు బొబ్బల ఇంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తవిటి రాంరెడ్డి, ఆత్మకూరు గ్రామశాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య, కార్యదర్శి బూడిద నర్సింహా, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు ఆకుల రవీందర్, మండల అధికార ప్రతినిధి సూర్య తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చేసింది పొలంబాట కాదు... వైరాగ్యయాత్ర



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కెసిఆర్ చేసింది పొలంబాట కాదని, వైరాగ్య యాత్ర అని, రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు కెసిఆర్‌కు లేదని డిసిసి ఉపాధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేడిగడ్డ కుంగుంది. మానేరు ఎండిది ఈ పాపం నీది కాదా, మా ప్రజా ప్రభుత్వం కరువుపై చర్యలు చేపట్టింది. వరి వేస్తే ఉరి అన్న నీవు రైతుల గురించి మాట్లాడేది, ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన చరిత్ర నీది అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సారు, కారు పదహారు అన్న మీరు ఇప్పుడు మీ అభ్యర్థులు పరారయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా మనసు మార్చుకుని ప్రతిపక్షంగా ప్రజా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ప్రభుత్వం పోయిన నాలుగు నెలలకే అధికారం లేక తట్టుకోలేక పోతున్నావని, గత పది సంవత్సరాలుగా ప్రతిపక్షంగా నీ అరాచకాలను, అవినీతిని, అబద్దాలను ఎండగట్టి ప్రజలలో నిన్ను దోషిగా నిలబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. కరువు యాత్ర పేరు మీద నీవు ఎన్ని డ్రామాలు ఆడిన నిన్ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందన్నారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఏ ఒక్క రైతు ఆధైర్య పడవద్దని, ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లిస్తుందన్నారు.

## పోరాటాల గడ్డపై కమ్యూనిస్టు జండా ఎగురాలి



**ప్రజాపక్షం/ఆలేరు :** తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కలిగిన భువనగిరి పార్లమెంటు ప్రాంతం ఏ ఊరు వెళ్లిన కమ్యూనిస్టు జెండాలు అమరవీరుల స్థూపాలు కనిపిస్తాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, భువనగిరి పార్లమెంటు పార్టీ అభ్యర్థి ఎండి జాంగిర్ అన్నారు. సోమవారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో లక్ష్మీ గార్డెన్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాల గడ్డపై కమ్యూనిస్టు జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి, మద్యపురం రాజు, మండల కార్యదర్శి శ్రీశైలం, జాంగిర్, దుపటి వెంకటేష్, టౌన్ అధ్యక్షుడు ఇక్బాల్, భాస్కర్ రెడ్డి, బిక్షం, సుధగాని సత్య రాజయ్య, పిక్క గణేష్, మల్లేష్, అమీర్, సంఘీ రాజు, బోడ భాగ్య, మొరిగాడి రమేష్, జూకంటి పౌలు, భువనగిరి గణేష్, అజయ్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** రాష్ట్రంలో ఎండిపోయిన పంట పొలాలకు ఎకరాకు రూ.30వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని బిజెపి నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని దేశ ప్రజలు,యువత కోరుకుంటున్నారన్నారు.బిజెపి అంటేనే అభివృద్ధికి మారుపేరన్నారు.ప్రధాని మోడీ అయోధ్యలో రామమందిరం నిర్మిస్తారని ఎవరూ ఊహించలేదన్నారు.మోడీ ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లిన ఆ దేశాల ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలుకుతు న్నారన్నారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైల్వే, పోర్టుల ఆధునీకరణకు పెద్ద పీట వేసిందన్నారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తుందన్నారు.పంటలు ఎండిపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

## క్విజ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన తేజ విద్యార్థులు



**ప్రజాపక్షం/కోదాడరూరల్ :** భారత ప్రభుత్వ క్రీడా సాధికార సంస్థ, కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో 8 నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు శారీరక వ్యాయామం, క్రీడల పట్ల అవగాహన కోసం గత మూడు సంవత్సరాల నుండి ఫిట్ ఇండియా క్విజ్ నిర్వహిస్తున్నారు. ఫిట్ ఇండియా క్విజ్ 2023లో భాగంగా అన్ని రాష్ట్రాల్లో ప్రాథమిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జట్ల నుంచి రాష్ట్ర ఫైనల్స్ ద్వారా ఒక జట్టును జాతీయ ఫైనల్స్‌కు ఎంపిక చేస్తారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో వేల పాఠశాలల నుండి ప్రాథమిక పరీక్ష తరువాత ఫిట్ ఇండియా ఫైనల్స్‌కు 8 పాఠశాలలు ఎంపిక చేస్తారు.సోమవారం సెమీఫైనల్, ఫైనల్ క్విజ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు.ఈ పోటీలను శాయ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.శాయ్ కోచ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు జరిగాయి.మండలంలోని కొమరబండ తేజ విద్యాలయానికి చెందిన విద్యార్థులు పల్లా హృతిక్, కొండ్ర నవీన్‌కుమార్ రాష్ట్ర స్థాయి ఫిట్ ఇండియా క్విజ్‌లో వందపాయింట్లు సాధించి విజేతలుగా నిలిచారు. ఏప్రియల్ చివరివారంలో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి ఫైనల్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొన నున్నారు. రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచిన హృతిక్, నవీన్‌కుమార్‌లు రూ.2,50,000వేల బహుమతిని గెలవడం జరిగింది. జాతీయ స్థాయి ఫైనల్స్‌లో గెలిచిన జట్టుకు రూ.35లక్షల బహుమతి ఇవ్వడం జరుగుతుంది. విజేతలైన తేజ విద్యాలయ విద్యార్థులు హృతిక్, నవీన్‌లను ఫిట్ ఇండియా క్విజ్ పర్యవేక్షణ కోసం వచ్చిన శాయ్ హైదరాబాద్ రీజియన్ కబడ్డీ ఛీఫ్ కోచ్ ఎ.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ రమా సోమిరెడ్డిలు అభినందించడం జరిగింది.

## నూతన పద్మశాలి సంఘ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణ పద్మశాలి సంఘంకు నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యుల చేత పదవి ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షులు చిక్క వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన పట్టణ సంఘం అధ్యక్షులుగా కాటబత్తిని ఆంజనేయులు మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణంలో భక్త మార్కండేయ గుడి నిర్మించడం మా కార్యవర్గ ముఖ్య ఉద్దేశమని తప్పకుండా మార్కండేయ జయంతి నాటికి అందరి సహకారంతో గుడి నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అఖిల భారత పద్మశాలి అన్నసత్రం యాదగిరిగుట్ట కార్య నిర్వాహక అధ్యక్షులు దికొండ జోగయ్య మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యుల అందరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ పట్టణంలో భక్త మార్కండేయ గుడి నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా అంకం రాజేష్, కోశాధికారిగా కోడూరి నరసింహ సంఘ ఉపాధ్యక్షులుగా ఎర్రగుంట్ల వెంకటేష్, బదుగు మల్లేశం, కుసుర్ కర్ నగేష్, గొర్ల గణేష్, సహాయ కార్యదర్శులుగా కుసుమరాజు, ఎర్రగుంట్ల చంద్రశేఖర్, మండల శ్రీనివాస్, గొర్ల జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా మెరుగు మధుసూదన్, భీమనపల్లి లక్ష్మీ నారాయణ, నామని బాలరాజు, మహేశ్వరం సత్యమ్మ, గుండు నరేందర్, మచ్చ సమ్మయ్య, పులగం భాస్కర్, ఎక్కడ దేవి భాస్కర్, మిరియాల కృష్ణ తదితరులు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పద్మశాలి నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** రైతులు ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిపిఎం మార్కెటింగ్ సునీల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని దళారుల వద్దకు వెళ్లి నష్టపోవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి ఉష, ఏపిఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఇందిరా, సిసి శ్రీలత, బిఓఓలు గ్రామ సంఘం కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన మునుగోడు ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఉప్పల లింగస్వామి సౌజన్యంతో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మంచి నీటిని త్రాగి వేసవిలో చలివేంద్రం నిర్వహించడం ద్వారా వివిధ గ్రామాల నుండి మండల కేంద్రానికి వచ్చేటువంటి ప్రయాణికులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మందుగుల బాలకృష్ణ, బిక్షపతి నాయక్, మేకల రమేష్, శీను నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి సతీష్, నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవాలు

**ప్రజాపక్షం/పాలకవీడు:** మండల కేంద్రంలోని శ్రీకోదండ రామలింగేశ్వరస్వామి క్షేత్ర శిఖర ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ప్రతిష్ఠ మహోత్సవంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి భూక్యా గోపాల్ నాయక్, జడ్‌పిటిసి మోతీలాల్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి జితేందర్‌రెడ్డి, నాగమల్లేశ్వరరావు, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు మీసాల ఉపేందర్,నాయకులు,ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ




**ప్రజాపక్షం/కోదాడ :** రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతుల వివాహ వార్షిక వేడుకల సందర్భంగా కోదాడ పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు, బాలింతలకు పండ్లు,బ్రెడ్లు, పండ్ల రసాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలే కన్న బిడ్డలుగా భావించి ప్రజాసేవకు అంకితమైన ఆదర్శ దంపతులు ప్రజల ఆశీస్సులతో కలకాలం వర్ధిల్లాలని భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్,ఎమ్మెల్యే పద్మావతి దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గట్టు నిఖిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**ప్రజాపక్షం/తుర్కపల్లి:** ప్రజలు, ప్రయాణికుల దాహార్తీని తీర్చడానికి తుర్కపల్లి మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద గట్టు నిఖిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని స్థానిక ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్ నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండా కాలం దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తీర్చడానికి గట్టు తేజస్వి నిఖిల్ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకుల దేవయ్య, యువకులు సీతరాజు, మహాదేవుని భాను, లక్ష్మి కాంత్, భాస్కర్, శ్రీకాంత్, శ్రీను, శ్రీకాంత్, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగికి అండగా నిలిచిన తోటి ఉద్యోగులు

**ప్రజాపక్షం/అనంతగిరి:** ఇటీవల బైక్ ప్రమాదంలో గాయలపాలై చికిత్స పొందుతున్న మండలంలోని పాలవరం గ్రామానికి చెందిన మట్టపల్లి రామకృష్ణకు తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. కోదాడలో ఫ్లిప్‌కార్డు ఉద్యోగిగా పనిచేసిన మిత్రుడికి కుటుంబ ఆర్ధిక ఇబ్బందుల ఎదుర్కొంటున్న దృష్ట్యా విషయం తెలుసుకుని ఆర్ధిక సహాయం అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులలో ఎవరికి ఆపద వచ్చిన అందరం కలసికట్టుగా ఒక గ్రూప్‌లా ఏర్పడి ఆర్ధిక సహాయాన్ని అందిస్తామన్నారు. ఆపదలో ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ఉద్యోగులకు బొల్లి కొండ రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదాల నివారణే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌లు

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి చాలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు జిల్లా చందనా దీప్తి తెలిపారు. మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 457 మంది పట్టుబడగా మద్యం బాబులను కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి ఒక రోజు, నలుగురికి రెండు రోజులు, ఒక్కరికి మూడు రోజుల జైలు శిక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన వ్యక్తులకు జరిమానా విధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతి రోజు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు . ప్రతీ వాహనదారులు వాహనానికి సంబందించిన సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు చర్యలు తప్పవని అన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో,పబ్లిక్ ప్లేస్‌లలో మద్యం తాగితే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ చందనా దీప్తి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ సమస్యలపై వచ్చిన దాదాపు 25 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల, మహిళలకూ వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

## భువనగిరి పార్లమెంటులో కాంగ్రెస్‌దే గెలుపు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ని భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఏఐసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన ధర్మారం గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. భువనగరి పార్లమెంట్ అభ్యర్థిత్వంలో మద్దతు తెలియజేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.పార్లమెంట్ ఎన్నికలలో భువనగిరి పార్లమెంట్ నుండి అత్యధిక మెజార్టీతో గెలుస్తామని మీ గెలుపుకు కృషి చేస్తానని నా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సామేల్ కౌలు చేస్తున్న వ్యవసాయ క్షేత్రంలో వరి పొలంలో వరికోతను ప్రారంబించారు. అనంతరం పక్కనే ఉన్న బిక్కేరు వాగుపై నిర్మిస్తున్న చెక్ డాం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన చెక్ డాం పనులు తను గెలిచాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నానని అలాగే బిక్కేరువాగులో ఇసుకను లూటీ చేయటకు గత బిఆర్ఎస్ ప్రభుత్వ కుట్టను అడ్డుకున్నానని వాగులో వేసిన రోడ్లను కిరణ్ కుమార్ రెడ్డికి చూపించి వివరించారు.భూగర్భజలాలు పెంచేందుకు చెక్ డాంలు ఎంతో ఉపయోగమన్నారు.రైతులకు రుణపడి ఉంటామన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన మోడీ

**ప్రజాపక్షం/నడిగూడెం:** కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని 2014లో ఇచ్చిన హామీని ప్రధాని మోడీ మరచిపోయి దేశంలో యువకులను మోసం చేశాడని మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్ ఎద్దేవా చేశారు.సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు కోట్ల ఉద్యోగాలు అంటే 10 కోట్ల ఉద్యోగాలు దేశంలో ఇవ్వాల్సిన మోడీ ప్రభుత్వం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించి నిరుద్యోగ రేటు పెరగడానికి కారణమయ్యారన్నారు. దేశంలో సంపన్నులకు కొమ్ముకాస్తూ పేద మధ్యతరగతి వర్గాల ప్రజలపై అధిక ధరల భారం మోపి సామాన్యుల నడ్డి విరిచిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రజలు, యువత తగిన గుణపాఠం చెప్పి కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకవచ్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు నాగరాజు, జూలూరు వీరాచారి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కాసాని,గోపినాథ్, గుంజ మురళీ పాల్గొన్నారు.

## నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ



**ప్రజాపక్షం/భువనగిరి:** రంజాన్ పవిత్ర మాస ఉపవాసా దీక్షలు పాటిస్తున్న నిరుపేద ముస్లిం కుటుంబాలకు మేరాజ్ గ్రూప్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్, ఇస్తియాక్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇస్లాంపూర్ మసీదు వద్ద నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక మదర్ థెరిస్సా హైస్కూల్ కరస్పాండెంట్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నిరుపేద ముస్లిం కుటుంబాల సంక్షేమానికి నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న ఇంతియాజ్ అహ్మద్, ఇస్తియాక్ అహ్మద్‌లు చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి అభినందించారు. రెండవ విడతలో భాగంగా సోమవారం పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాల కు ఒక్కొక్కరికి రూ.3000 రంజాన్ తోఫా కిట్టును మరో రెండు లక్షల రూపాయలతో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రంజాన్ మాసంలో పేదలను గుర్తించి వారికీ తమకు తోచిన సహాయం అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీజేయు జిల్లా అధ్యక్షుడు ఎండి.శానూర్ బాబా, మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ.ఇస్తియాక్ అహ్మద్, సయ్యద్ రఫీఖ్ అహ్మద్, ఎండీ.కామ్రాన్ హుస్సేన్, ఎండీ.సలీం, ఎండీ.గయాజ్ అహ్మద్, ఎండీ.సిరాజ్, ఎండీ మొఖ్తార్, అహ్మద్, ఆదిల్ రాషేద్, షకీల్, రెయ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ పై విచారణకు ఆర్‌డిఓ ఆదేశం

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీ పరిధిలో తప్పుడు ధృవపత్రాల ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న డాక్యుమెంట్లను రద్దు చేయాలని రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ కట్ట బిక్షం ఆర్‌డిఓకు ఫిర్యాదు చేయగా అట్టి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి ఆధారాలతో సహా నివేధిక సమర్పించాలని చండూరు మండల పరిషత్ అధికారికి, తహసీల్దార్‌కు,మున్సిపల్ కమీషనర్‌కు ఆర్‌డిఓ సుబ్రమణ్యం ఆదేశాలు జారీ చేశారు.

## ఎంపిపిపై నెగ్గిన అవిశ్వాసం



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు ఎంపిపిపై సోమవారం నిర్వహించిన అవిశ్వాసంకు 9 మంది ఎంపిటిసి సభ్యులు హాజరై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. మొత్తం ఎంపిపితో కలిపి 10మంది సభ్యులకు కాను ఎంపిపి మినహా 9మంది ఎంపిటిసి సభ్యులు అందరూ సమావేశానికి హజరై అవిశ్వాసానికి మద్దతు తెలుపడంతో ఎంపిపి కళ్యాణి తన పదవిని కోల్పోయారు. ఎంపిపి అవిశ్వాసానికి రెండు రోజుల ముందే తన పదవికి రాజీనామ చేస్తూ జిల్లా పరిషత్ సిఇవో ప్రేమ్ కరణ్‌రెడ్డికి రాజీనామ పత్రంను అందజేశారు.

## ఘనంగా కంఠమహేశ్వర స్వామి బోనాలు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండల కేంద్రంలో కంఠమహేశ్వర స్వామి బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు డప్పు చప్పుల్లతో బోనాలను కంఠమహేశ్వర స్వామికి సమర్పించారు. పూజ నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు సోమవారం కాంగ్రెస్ గ్రామశాఖ మునుకుంట్ల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అక్బర్, ఉపాధ్యక్షుడు అస్గర్, ఇబ్రహీం, జానీ, రహీమ్, చాంద్ పాషా సమద్, లింగాల నరసింహ, మాజీ సర్పంచ్ మర్రి పాండు రెడ్డి, వంగూరి రవి, దోసపాటి రవి, మల్లేష్ గౌడ్, తస్వాన్ రెడ్డి, రహన్యా రెడ్డి, వంశీ గౌడ్, శ్రవణ్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/వేములపల్లి:** రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందవచ్చని డిఆర్‌డిఏ పిడి టి.నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించే సమయంలో 17 శాతం కంటే తక్కువగా తేమ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే సమయంలో రైతులు తమ ఆధార్ కార్డు,బ్యాంక్ పాస్ పుస్తకం, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను తమ వెంట తీసుకువచ్చి కొనుగోలు కేందర్రం నిర్వాహకులకు సమర్పించాలన్నారు. నాణ్యమైన వరి ధాన్యానికి ఏ గ్రేడ్ కు 2,203 రూపాయలు, సాధారణ రకానికి 2,183 పొందవచ్చు అన్నారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని సీరియల్ ప్రకారం కాంటాలు వేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె. నాగమణి, ఏపిఎం ఎండి నిజాముద్దీన్, సీసీ రమణయ్య, ఈజీఎస్ ఏపీవో మీరాజుద్దీన్, కమిటీ సభ్యులు సైదమ్మ,లూర్ధమ్మ, జానమ్మ, శ్రీలత, దివ్య, వివో ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి టిఫిన్ బైఠక్ సమావేశం

**ప్రజాపక్షం/చండూరు:** భారతీయ జనతా పార్టీ టిఫిన్ బైఠక్ సమావేశం సోమవారం చండూరు మండల కేంద్రం లోని శీలా అనసూయ ఫంక్షన్ హాల్ నిర్వహించడం జరి గింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నర్సింహ్మా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏప్రిల్ 6న బిజెపి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆ రోజు నిర్వహించే పార్టీ కార్యక్రమాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాబోమో పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి చండూరు మండల అధ్యక్షుడు ముది గొండ ఆంజనేయులు, పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి బొమ్మరబోయిన రాజు, నాయ కులు పిట్టల శ్రీను, కోమటి వీరేశం, కాసాల జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు ఆవశ్యకతపై అవగాహన పెంచాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** లోక్‌సభ ఎన్నికల నేప థ్యంలో జిల్లాలో స్వీప్ కార్యక్రమాలలో భాగంగా సోమ వారం పట్టణంలోని కొత్త బస్టాండ్ నుండి సద్దల చెరువు వరకు 5కె రన్ పెద్ద ఎత్తున నిర్వహించారు. శంకర్ విలాస్ ఎంటర్ వద్ద మానవహారం నిర్వహించి ఓటు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రతి ఒక్కరు ఓటు వేయాలి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ప్రలోభాలకు లొంగవద్దని, నిర్భయంగా ఓటు వేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ జిల్లా అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మున్సి పల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

**ప్రజాపక్షం/మద్దిరాల:** ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఏపిడి సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని పోలుమళ్ల, మద్దిరాల మండల కేంద్రంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు మధ్య దళారులను నమ్మవద్దని, తాము పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యం రూ.2203, బి గ్రేడ్ రూ.2183ను పొందాలని సూచిం చారు.కార్యక్రమంలో తహసీల్దార్ అమీనొసింగ్, ఎంపిడివో సత్యనారాయణరెడ్డి, డిపిఎం ఆంజనేయులు,ఏపిఎం మైశయ్య, ఏవో వికాస్‌పాటిల్, ఏఈవో భవ్యశ్రీ, సిసిలు రమేష్, నాగార్జునరెడ్డి, శేరి రాధిక, స్వప్న, మైపాల్‌రెడ్డి, రైతులు వడ్డాణం రవీందర్, అమృత మల్లు, శ్యామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికల నియమనిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలి

**ప్రజాపక్షం/నూతనకల్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమనిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని స్థానిక ఎస్‌ఐ జూకూరు సైదులు అన్నారు. సోమవారం ఎన్నికల నిబంధనలలో భాగంగా ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నియమనిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట ఏఎ స్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది విజయ్,వెంకన్న,రాము పాల్గొన్నారు.

# రైతులు దళారులకు మోసపోవద్దు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోకుండా ఐకేపీ ధాన్యం కొను గోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఎంపిడిఓ పి.శంకరయ్య అన్నారు. సోమవారం అడ్డగూడూరు మండలకేంద్రంలో ఆయన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారం భించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లా డుతూ రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వం మద్దతు ధర రూ.2,203 పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వెంకటేశ్వర్లు, సిసిలు



యాదయ్య, ప్రసాద్, ఏఈఓ ధయాకర్, మహిళా సమాఖ్య సభ్యులు, రైతులు తదితరులు పాల్గొ న్నారు.

## చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ :** మండలంలోని మండలంలోని బస్టాప్ వద్ద గల ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద సూర్యాపేట రూరల్ సిఐ వై.సురేందర్ రెడ్డి, రూరల్ ఎస్‌ఐ ఆర్.బాలునాయక్, సిబ్బంది,ఎస్ఎస్‌టిమ్ సిబ్బంది సోమవారం వాహ నాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుండి ఖమ్మం వైపు వెళ్తున్న టిఎస్ 09 యూఈ 2479 నెంబర్ గల బుల్లోర వాహనంలో 1135 గ్రాముల బంగారం దాని విలువ రూ.76లక్షల 75వేల 39 రూపాలయు కాగా, వెండి 17 కిలోల 099 గ్రాముల 500 మిల్లీగ్రాములు దాని విలువ రూ.13లక్షల 55వేల 990లు విలువ మొత్తం విలువ రూ.90,31,038 గల వాటిని ఎలాంటి అనుమతి లేకుండా తీసుకవెళ్లుండగా పట్టుకుని



ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు సిఐ,ఎస్ ఐలు తెలిపారు.

## ఉన్నత విలువలతో విద్యనందిస్తున్న సరస్వతి విద్యా మందిర్

**ప్రజాపక్షం/భూదాన్ పోచం-పల్లి:** ఉన్నత విలువలతో నాణ్య మైన ఉత్తమ విద్య నందిస్తున్న ఘనత సరస్వతి విద్యా మందిర్ ఉన్నత పాఠశాలదనీ ముఖ్య అతి థులు జిల్లా ట్రస్మా అధ్యక్షులు




పగడాల జలంధర్ రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యా యులు గుర్రం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నోముల గణేష్‌లు కొనియాడారు. భూదాన్ పోచం పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ 40వ వార్షికోత్సవాన్ని బాలాజీ ఫంక్షన్ హాల్లోఆది వారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్థాపించిన నాటి నుంచి విద్యార్థులకు సదాచారంతోపాటు మంచి క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యను అందించడంలో ఈ పాఠశాలకు జిల్లాలో మంచి గుర్తింపు ఉందని ప్రశంసించారు. ప్రతి సంవత్స రము విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు మండల ర్యాంకులు సాధించిన తీరు పాఠ శాలలకు స్ఫూర్తి అని అన్నారు. పాఠశాల చైర్మన్ సింగన బోయిన సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నామిని భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు మారు తున్న కాలానికి అనుగుణంగా విద్యలో వస్తున్న పెను మార్పులకు తోడుగా ఉన్నత విద్యా ప్రమాణా లను పాటిస్తూ క్రమశిక్షణతో అనుభవజ్ఞులైన ఉపా ధ్యాయులచే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతున్నామని అన్నారు. పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను అతిథు లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ బండి యాదగిరి, బసవలింగం, కుడి కాల దశరథ, వనం వెంకటేశం, చంద్రశేఖర్, నోముల బస్వా రెడ్డి, మండల అధ్యక్షులు వంగూరి పాండు, ప్రధాన కార్యదర్శి భాస్కరాచారి, ఎడ్ల తిరు మల్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు విశేషంగా అలరించాయి.

## గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**ప్రజాపక్షం/చండూరు:** గత రెండు సంవత్సరముల వరకు ప్రతి నెల 20 మంది నిరుపేదలకు ఒక్కొక్క రికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యవసర సరు లను పంపిణీ చేస్తున్న చేస్తున్న గాంధజీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం అని లయన్స్ క్లబ్ ఆఫ్ చండూరు సేవా అధ్యక్షులు కొత్తపాటి సతీష్ అన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు , గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు సౌజ న్యంతో గాంధీజీ పౌండేషన్ ఆధ్వర్యంలో నాల్గవ నెల నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో కొత్తపాటి సతీష్ మాట్లాడుతూ మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగిన సమాజానికి ఏదో ఒక సేవ చేయాలనే కోరికతో , సేవే లక్ష్యంగా మందుకెళ్తున్న డాక్టర్ కోడి శ్రీనివాసులు గాంధీజీ ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి చేస్తున్న సేవలు అభినందనీయం , స్ఫూర్తిదాయకం అని అన్నారు. మానవత్వానికి చేసే సేవ ,దేవుడికి చేసే సేవతో సమానమని అన్నారు. గాంధీజీ ఫౌండేషన్ ఇంకా ఎక్కువ



మందికి సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించా లని ,రాబోయే రోజుల్లో ఈ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలు పేద ప్రజలకు అందించాలని ఆశిం చారు.ఈ కార్యక్రమంలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివా సులు, లయన్స్ క్లబ్ మెంబర్స్ గంజి యాదగిరి, మందడి శంకర్‌రెడ్డి, గుంటి వెంకటేశం,డాక్టర్ పోల గోని రమేష్,పున్న వెంకటేశం,సామ రఘుమారెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, గార్లపాటి మహేందర్, వెంకటా చారి, అంజిబాబు, రాపోలు జగదీశ్వర్,రావిరాల రాజు, గాంధీజీ విద్యా సంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, బుషిపాక యాదగిరి, బోడ విజయ్ తదిత రులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/మోతె:** పిఏసిఎస్ సిరికొండ సొసైటీ బ్యాంకు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో దూసపాటి ఉపేందర్, ఏపిఎం వెంకయ్యలు మండల కేంద్రంతో పాటు మండలంలోని మామిళ్లగూడెం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరేడువాయి గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొను గోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నం దున కొనుగోలు కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం 17 శాతం తేమ ఉండాలన్నారు. ఏగ్రేడ్ ధాన్యం 2203, గ్రేడ్ బి ధాన్యం ధర రూ.2183 లు మద్దత ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈ వోలు ఉయ్యాల కార్తీక్, ఉష, సిసి శ్రీను, మహిళా సంఘాల అధ్య క్షురాలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నూతనకల్:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ శ్రీనివాసరావు రైతులను కోరారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గుండ్లసింగారం, దిర్శనపల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వ హించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర ఏ గ్రేడ్ 2203, బి గ్రేడ్ రూ.2183ను పొందాలన్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకవచ్చి కొనుగోలు నిర్వహణ దారులకు సహకరించాలని రైతులను కోరారు. కర్యాక్ర బంలో జిల్లా అధికారి ఏపిడి సురేష్, డిపిఎం ఆంజనేయులు, ఎంపిడివో సునిత,ఏవో మురళి, ఆర్‌ఐ ప్రసాద్, ఏపిఎం కర్ణాకర్, సిసి ముత్తయ్య, సరస్వతీ, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## దోమల నివారణ, మంచినీటి సరఫరాలో విఫలం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** పట్ట ణంలో దోమలు నివారించడం, మంచినీటి సరఫరాలో మున్సిపల్ పాలకవర్గం, స్థానిక ఎమ్మెల్యే జగదీ ష్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పల్స మల్సూర్‌గౌడ్ 30 వార్డు కౌన్సిలర్, బిజెపి ఫ్లోర్ లీడర్ పల్స మహాలక్ష్మీ మల్సూర్‌గౌడ్‌లు ఆరోపించారు. పారిశుద్ధ్య లోపం మూలంగా వార్డు లలో దోమల బెడదతో ప్రజలు విష జ్వరాల, అంటువ్యాధుల భారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినిత్యం సాయంత్రం వేళ దోమ నివారణ మందులు పిచికారీ చేయాలని కోరారు. సంబంధిత అధికారులను అడగగా దోమల మందులలేదు అని నిర్లక్ష్యంగా సమాధానం చెపుతు న్నారు. మరి చైర్మన్ ఏం చేస్తున్నారు. నియజకవర్గం నుండి మూడుస్లా ఎమ్మెల్యేగా గెలిచిన జగదీష్‌రెడ్డి తాగునీటిని పట్టణ ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలమైయ్యారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న పట్టణంలో నీటి సమస్యను మాత్రం తీర్చలేదన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వమైన వేసవికాలం సమీపించడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేయాలని కోరారు. పట్ట ణంలో దోమలను అరికట్టడంలోను, మంచినీటిని సరఫరా చేయ డంలోను అధికారులు సరైన సమయంలో చర్యలు తీసుకోకుండా అలసత్వం వహిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ ఖాతాలోకి నేరేడుగొమ్ము ఎంపిపి

**అవిశ్వాసంలో బిఆర్ఎస్ ఎంపిపి పద్మ నాయక్‌పై నెగ్గిన అవిశ్వాసం...**
**ఎంపిపిగా బిక్కు నాయక్**
**ఎంపికయ్యే ఛాన్స్**



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గం లోని నేరేడుగొమ్ము మండలవ ఎంపిపి, వైస్ ఎంపిపి లపై పెట్టిన కాంగ్రెస్ సభ్యుల అవిశ్వాసం నెగ్గింది. ఈ మేరకు సోమవారం ఆర్డీవో శ్రీరాములు ఆధ్వర్యంలో మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు బిఆర్ఎస్ ఎంపిపి, వైస్ ఎంపిపిలపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. నేరేడుగొమ్ము మండలంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపిపిగా బాణావత్ పద్మహన్మనాయక్, వైస్ ఎంపిపిగా ఆరేకంటి ముత్యాలమ్మరాములు ఎన్నిక య్యారు. ఇటీవల జరిగిన ఎంఎల్ఎ ఎన్నికల్లో అటు రాష్ట్రంలో, దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చేరికల అనంతరం కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సభ్యులు తోడయ్యారు. మండలంలో ఆరు ఎంపిటిసి స్థానాలకు గాను నాలుగు ఎంపిటిసి సభ్యులు కాంగ్రెస్ సభ్యులు కావడతో గత 20 రోజుల కిందట నేరేడుగొమ్ము ఎంపిపిపై అవిశ్వాసం పెడుతున్నట్లు అధికారులకు మెజార్టీ సభ్యులు దరఖాస్తు ఇవ్వగా 15 రోజుల పనిదినాల అనంతరం సోమవారం అవిశ్వాసానికి అవకాశం ఇవ్వడంతో మెజార్టీ సభ్యులు కలిగిన కాంగ్రెస్ ఎంపిటిసిలు, ఎంపిపి పద్మ నాయక్, వైస్ ఎంపిపి ముత్యాలమ్మలపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కాగా నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలినట్లు అయ్యింది. విషయం తెలిసిన బిఆర్ఎస్ ఎంపిపి, వైస్ ఎంపిపిలు రెండు రోజుల క్రితమే తమ రాజీనామాలను సమర్పించారు. అవిశ్వాసం నెగ్గిన కాంగ్రెస్ ఎంపిపిని తన ఖాతాలోకి తెచ్చుకుంది. కాగా ఎంపిపిగా కాచరాజుపల్లి ఎంపిటిసి వాంకుడావత్ బిక్కునాయక్‌కు అధిష్టానం , స్థానిక ఎంఎల్ఎ బాలునాయక్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నందున ఎంపిపిగా త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు లోకసాని కృష్ణయ్య, పిఏసిఎస్ చైర్మన్ శ్రీశైలం, ఎంపిటిసిలు యుగేందర్‌రెడ్డి, రమేష్, సరోజ, వర్కింగ్ ప్రెసిడెంట్ పాపానాయక్, రమేష్‌నాయక్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాంసింగ్, సురేందర్‌రెడ్డి, శబాష్, గణేష్, రమేష్, మాజీ ఎంపిటిసిలు సోమాని, వెంకటయ్య, యాదయ్య పాల్గొన్నారు.

**బిక్కునాయక్ రాజకీయ ప్రస్థానం...**
బిక్కునాయక్ కుటుంబ నేపథ్యం కాంగ్రెస్ పార్టీ కావడంతో రాజకీయాల్లోకి వచ్చిన బిక్కునాయక్ 2006లో చిత్రియాల ఎంపిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం చిత్రియాల పిఏసిఎస్ చైర్మన్‌గా 2013లో ఎన్నికయ్యారు. 2020 లో ఎంపిటిసిగా ఎన్నికై తర్వలోనే నేరేడుగొమ్ము ఎంపిపిగా ఎంఎల్ఎ నేనావత్ బాలునాయక్ ఆశీస్సులతో పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా బిక్కునాయక్ మాట్లాడుతూ అవిశ్వాసం నెగ్గేందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, ఎంపిటిసిలకు, ఎంఎల్ఎ బాలునాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపి కక్షపూరిత చర్య

**ప్రజాపక్షం/ శాలిగౌరారం:** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అక్రమ అరెస్టు చేయడం బిజెపి రక్షపూరిత చర్య అని ఆప్ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం ఆప్ పార్టీ నేషనల్ కార్యాలయం ఢిల్లీలో ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్ నాణ్యమైన విద్య, వైద్యంతో కూడిన మంచి పరిపాలన అందిస్తూ అతి తక్కువ కాలంలో ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రంలో ఆప్ పార్టీ అధికారం చేపట్టారు.జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకి బ్రహ్మరథం పట్టే అవకాశం ఉందని,ఒక సామాన్యుడి వలన అధికారం పోతుందని భావించిన బీజేపీ పార్టీ కక్ష పూరితంగా మోడి, షాలు అరవింద్ కేజ్రీవాల్ ని అక్రమ కేసుల్లో (లిక్కర్ స్కాం)ఇరికించి తీహార్ జైల్లో రిమాండ్లో ఉంచారు. అక్రమ కేసులు ఎత్తివేసి అరెస్ట్ అయిన ఆప్ నేతలను భేషరతుగా విడుదల చేయాలని, ఢిల్లీ ప్రభుత్వపాలన తీహార్ జైలు నుంచి కొనసాగించేందుకు సుప్రీం కోర్టు అనుమతి ఇవ్వాలని యంపల్ల పురుషోత్తం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక 3, క్లాస్ 1 ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బాలివాటిక 3లో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు పాఠశాలలో అందుబాటులో ఉంటాయన్నారు. క్లాస్ 1లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాలవాటికకు జనన ధృవీకరణ పత్రం, ఆధార్, కుల ధృవీకరణపత్రం, విద్యార్థి ఫోటో, నివాస ధృవీకరణ పత్రాలతో ఏప్రిల్ 1నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## నేడు నీటి సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం–/ మిర్యాలగూడ:** ఈనెల 2న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఫిల్టర్ బెడ్ ట్యాంక్ తండా వదద మోటార్లు, జనరేటర్ రిపేర్లు జరుగుతున్న కారణంగా పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, నీటి సరఫరా ఉండదని చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమీషన్ ఎండి.యూసుఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పట్టణ గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు 2024 25 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నును ఏప్రిల్ 30లోపు చెల్లించిన వారికి పన్నుపై 5శాతం మినహాయింపు ఇస్తుందన్నారు. పట్టణ ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని సంబంధిత బిల్ కలెక్టర్లకు, కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్ను చెల్లించి రశీదు పొందాలన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజాపక్షం/ మాడుగుల పల్లి:** మండలంలోని ఆగామోత్కూర్, చిరుమర్తి ,పాములపాడు, గారకుంటపాలెం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ఏపిఎం అనుక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపిఎం మాట్లాడుతూ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ పి నాగలక్ష్మి,సిసి లు నాగయ్య స్వాగతరావు, నిర్వాహకులు రేణుక, పద్మ, సైదులు, ఎల్లమ్మ, రేణుక, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



# మతోన్మాద బిజెపిని ఓడించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో మతోన్మాద బిజెపిని ఓడించేందుకు ప్రతి సిపిఎం కార్యకర్త ముందుండాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు అన్నారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ దేశంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు అన్నివర్గాల ప్రజలు, పార్టీలు ఏకమై బిజెపిని ఓడించాలన్నారు.సిపిఎం నిరంతరం దేశంలోని పేదవర్గాలకు అండగా నిలబడి పనిచేస్తున్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బిజెపికి ఎండ కట్టేందుకు సిపిఎం ముందుందన్నారు.తెలంగాణలో బిజెపిని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు ముందున్నారన్నారు.అందుకు నిదర్శనం మునుగోడులో 2023లో జరిగిన మధ్యంతర ఎన్నికలే అన్నారు.పట్టణంలో సిపిఎం పార్టీ అభివృద్ధికి,నిర్మాణానికి తీసుకోవాల్సిన విషయలను సమావేశంలో చర్చించినట్లు ఆయన తెలిపారు.సమావేశంలో



సిపిఎంజిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, శీలం శ్రీను, తుమ్మకొమ్మ యోనా,రేపాకుల మురళీకృష్ణ,జక్కుల వెంకటేశ్వర్లు,చిన్నం వీరమల్లు,పాశం వెంకటనారాయణ, పిట్టల నాగేశ్వరరావు, రేపాకుల వీరస్వామి,తురక వీరయ్య,శీలం వెంకన్న,గణపవరం శ్రీను,శీలం సాంబయ్య,చింతకాయల పర్వతాలు,నకినబోయిన శంభయ్య పాల్గొన్నారు.

## రఘువీర్‌రెడ్డి విజయం ఖాయం

**ప్రజాపక్షం/డిండి:** కాంగ్రెస్ పార్టీ నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయం ఖాయం అని డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని



వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఎంపి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని కలిసిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మనుగడ సాధించడం కష్టమని అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు ఆరు గ్యారంటీలను అందించడంతో పాటు రాబోవు రోజుల్లో ప్రజారంజక పాలన కాంగ్రెస్ పార్టీ అందిచనుందని అన్నారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు

**ప్రజాపక్షం/కోదాడ :** ఎన్నికల విధులు బాధ్యతాయుతంగా పారదర్శకంగా నిర్వర్తించాలని కోదాడ ఆర్డీవో సిహెచ్ సూర్య నారాయణ అన్నారు.సోమవారం పట్టణంలోని సనా ఇంజనీరింగ్ కళాశాలలో మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ప్రిసీడింగ్, సహాయ ప్రిసీడింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పొరపాట్లు చేస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. శిక్షణను పూర్తిగా అవగాహన చేసుకుని ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై పూర్తి అవగాహన పొందాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెంట్ కొరకు ఫారం 12 పూర్తిచేసి రెవిన్యూ సిబ్బందికి అందచేయాలన్నారు. ఎన్నికల శిక్షణలో అందచేసిన నిబంధనల సూచనలను పూర్తిగా అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయి గౌడ, ఎంఈవో షరీఫ్, ఎన్నికల డిటి అనిల్, సంధ్యారాణి, ఆర్ఐలు రాజేష్,సుజిత్, ఎస్ఎల్ ఎమ్‌టీలు విప్పర్ల రమేష్, చందా శ్రీనివాస రావు, ఏఎల్ఎమ్‌టీలు యండి. హమీద్, వస్కుల రామారావు,వెంకటేశ్వర్లు, తల్లాడ శ్రీనివాసరావు, బొల్లికొండ కోటయ్య, శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ సిబ్బంది, పిఆర్‌వోలు, ఏపిఆర్ వోలు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య

**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రం లోని ఎస్సి కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంతో పాటు మండల పరిధిలోని మరిపడిగ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పూర్వ ప్రాథమిక విద్య యొక్క అవశ్యకత గురించి సూపర్‌వైజర్ ఎండి. షమీంబి వివరించడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు ఏళ్ల వయస్సు వరకు తల్లి బిడ్డకి, ఇంటికి పరిమితం ఐన పిల్లలు బయటి ప్రపంచాన్ని ప్రిస్కూల్ ద్వారా మొదలుపెడతారని, వివిధ అంశాల ఆధారంగా పిల్లలు తెలివి తేటలు వికసింపచేసుకుంటారని అన్నారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. ప్రిస్కూల్ ద్వారా పిల్లలు శారీరక, మానసిక, సాంఘిక అభివృద్ధి పెంపొందింపజేయడం జరుగుతుందని, ఆటలు, పాటలు, బుక్స్‌రాయడం, కథలు, పరిసరాల సంభాషణ, మంచి అలవాట్లు, శాస్త్రీయ పరిజ్ఞానం, సృజనాత్మక కార్యక్రమాలు మొదలగు విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రీస్కూల్ ఎగ్జిబిషన్ నిర్వహించి టీచర్లు తయారు చేసిన మెటీరియల్‌ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాక్‌పాషాబేగం, ఏడబ్ల్యూటిలు స్వరూప, కళమ్మ, ఆయాలు సోమనర్సయ్య, పోశమ్మ, గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



## సభాస్థలి పరిశీలన

**ప్రజాపక్షం/దేవరకొండ:** పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సదస్సు బుధవారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలో నిర్వహించనున్న సభా స్థలిని సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు లోకసాని కృష్ణయ్య, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, ఎంపిటిసి బిక్కునాయక్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొర్ర రాంసింగ్, పాపానాయక్, రమేష్‌నాయక్‌లు పరిశీలించారు. సభకు సీనియర్ నాయకులు జానారెడ్డి, జిల్లా అధ్యక్షులు శంకర్‌నాయక్, ఎంఎల్ఎ బాలునాయక్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.